# సలహా

'తాతా! ఓ అమ్మాయికి ఈత నేర్పాలి'

'ఓ దానికేం? తప్పకుండా నేర్పవచ్చు'

'నీకు యీతకొట్టడం వచ్చును కదూ, తాతా?'

'నాకు రాకపోవడమేమిట్రా? చిన్నప్పుడు గజీతగాణ్ణని తెలుసా? పెద్దపెద్దవాళ్లుకూడా నాతో యీదడమంటే 'రా, రా' మనేవారు'

'ఐతే, ఆడపిల్లలకి యీదడం నేర్పాలంటే ఎలాగ?'

'ఆఁ! దాల్లో పెద్దకష్టమేముంది? నేను చెప్పినట్లు చెయ్యి'

'అందుకేగా నీ దగ్గరకొచ్చింది. చెప్పు తాతా యేం చెయ్యాలో'

'మన వూళ్లో కొలనుందా? అక్కడకు అమ్మాయిని తీసుకెళ్లు. నేర్చుకునే అమ్మాయికి పదహారు, పదిహేడు సంవత్సరాలుంటే మరీ సులభం. అవునుగాని, అబ్బాయ్! నువ్వేనట్రా నేర్పేది?'

'నేనే తాతా! ఆ అమ్మాయికూడా సరిగా అంతే యీడుంటుంది'

'ఐతే మరీ మంచిది. చూడూ, ఈతకొట్టేటప్పుడు వేసుకునేందుకు దుస్తులుంటాయి, అవి ధరించమను ఆ అమ్మాయిని.

'అవును తాతా! ఆ దుస్తులు వేయించే నేర్పుతున్నా'

'అరి పిడుగా! అప్పుడే మొదలెట్టేవన్నమాట?'

'ఆఁ! తరవాత యేం చెయ్యాలి తాతా!

'ఇంకేం చెయ్యాలి? ఆ పిల్లని కొలనులో మోకాలులోతువరకూ తీసికెళ్లాలి. ఆడపిల్ల కదూ, సహజంగా భయపడుతుంది. ఒక్కొక్కప్పుడు వెనుక్కి పారిపోవచ్చుకూడా. అల్లాటిదేమీ జరక్కుండా నువ్వామె చేతిని గట్టిగా పట్టుకుని ఉండాలి అంతకన్నలోతు నీళ్ళలోకి రానని మారాంచేసినా చెయ్యవచ్చు. కాని నువ్వదేమీ వినిపించుకోకు.'

'అవును తాతా! అలా చేస్తేనే బాగుంటుంది. అప్పుడు జాలి తలిస్తే అంతా చెడుతుంది.'

'లోతు నీళ్ళలోకి అంటే నడుంవరకూ భయం లేకుండా దిగేటట్లు చెయ్యాలి. దానికేం పెద్ద హడావుడి చెయ్యనక్కర్లేదు, సరాగ్గా ఉన్నప్పుడు ముందుకు నెట్టేస్తే సరి, ఆ అమ్మాయి అప్పుడు అపరిమితంగా భయపడవచ్చు, నువ్వు కూడా వెనకనే వెళ్లి ఆమె రెండుచేతులూ పట్టుకొని భయం తగ్గించాలి. తరువాతనే ఉంది నువ్వు చెయ్యవలసిన పనంతా.'

'ఏమిటది?'

'నీటిమీద యీతకొట్టే భంగిమలో ఆ అమ్మాయిని నీ రెండుచేతులమీదా పట్టుకోవాలి, కాళ్లూ చేతులూ కదపడం నేర్పుతూ యీత నేర్చుకునే సూత్ర నియమాలు బోధించాలి, కొద్దిగా నీటిమీద తేలడం వచ్చేసరికి గభాల్న ఆమెను వదిలెయ్యాలి'

'అవును, తాతా! అలాగే వదిలేశా. ఆమె బెదిరిపోయి నన్ను గట్టిగా కౌగలించేసుకుంది.'

'అంతేరా, అంతే, సరిగ్గా జరగవలసినట్టుగానే జరిగింది, ఇంతకీ ఎవరికి నేర్పుతున్నావురా?'

'మీ మనవరాలికి నేర్పుతున్నాను, తాతా!'

'ఓరిభడవా, నువ్వా......'

వి. వి. సూర్యనారాయణ
మారేమండ రామారావు